# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రవాణా సౌకర్యాలు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి వి. సోమన్న తెలిపారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా 'ఆర్గానిక్ కుప్పం' కార్యక్రమంలో పాల్గొంటారు.**
3. **హైదరాబాద్ లోని ఆరాంఘర్– జూపార్కు పైవంతెనను తెలంగాణా ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు.**
4. **రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్ ఈ రోజు నుంచి మూడు రోజులపాటు విజయవాడలో జరగనుంది.**
5. **తెలంగాణలో 'కాటమయ్య భద్రతా కిట్ల రెండో విడత పంపిణీలో భాగంగా 10 వేల మందికి కిట్లను అందజేస్తామని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.**

===========================

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహాయసహకారాలను అందిస్తుందని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి వి. సోమన్న అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ రైల్వే స్టేషన్ యార్డ్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిను నిన్న జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపద సృష్టికర్తలని పేర్కొన్నారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రవాణా సౌకర్యాలు కీలక పాత్ర పోషిస్తాయని సోమన్న తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ రోజు చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటిస్తారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రైతుల్ని ప్రకృతి వ్యవసాయం పరిధిలోకి తెచ్చే లక్ష్యంతో 'ఆర్గానిక్ కుప్పం' పేరుతో పదేళ్ల ప్రణాళికను ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ అమలు చేయనుంది. కుప్పం నియోజకవర్గంలోని శీగలపల్లెలో చంద్రబాబునాయుడు ఈ రోజు 'ఆర్గానిక్ కుప్పం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. నియోజకవర్గంలోని నూరుశాతం రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆచరించేలా పదేళ్ల ప్రణాళికను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా పలు ప్రకృతి వ్యవసాయ సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రితో సమావేశమవుతారు.

---------------------------

హైదరాబాద్‌లోని ఆరాంఘర్– జూపార్కు పైవంతెనను తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈరోజు

సాయంత్రం ప్రారంభిస్తారు. హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారి మధ్య ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ఆరాంఘర్ నుంచి జూపార్కు వరకు 4.08 కిలోమీటర్ల పొడవుతో దాదాపు 800 కోట్ల రూపాయలతో పైవంతెనను హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ నిర్మించింది.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 72 శాతం పూర్తి కావడంతో పాటు డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తయిందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో  పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి అటు ఉత్తరాంధ్రకు ఇటు రాయలసీమకు గోదావరి జలాలను మళ్లించి త్రాగు, సాగునీరును అందిస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

చైనాలో వ్యాప్తి చెందుతున్న హ్యూమన్ మెటానిమో వైరస్ –హెచ్ఎంపీవీ కేసులు ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా నమోదు కాలేదని  ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ పద్మావతి తెలిపారు. ప్రజలెవరూ భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయని వెల్లడించారు. వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి కోవిడ్ సమయంలో పాటించిన తరహాలోనే జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు.

---------------------------

రాష్ట్రస్థాయి పాలిటెక్ ఫెస్ట్‌ను ఈరోజు నుంచి మూడు రోజులపాటు విజయవాడలో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేష్‌కుమార్ తెలిపారు. మేక్ ఇన్ ఇండియాకు అనుసంధానంగా, రాష్ట్రప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'స్కిల్ ఏపీ ప్రోగ్రామ్'లో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనలు, పరిశోధనలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నగరంలోని లబ్బీపేట, ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన ప్రాజెక్టుల నుంచి 249 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశామని  ఆయన పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో 55 వేల 143 ఉద్యోగాలు ఇచ్చామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సివిల్స్ మెయిన్స్ ఉత్తీర్ణత సాధించి.. ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు ఆర్థిక సాయాన్ని అందించారు.  ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.

వాయిస్... 34 సెకన్లు

---------------------------

అంధుల కోసం ప్రత్యేక లిపి సృష్టించి వారికి జ్ఞాన మార్గాన్ని ప్రసాదించిన మహనీయులు, ఫ్రెంచి విద్యావేత్త లూయీ బ్రెయిలీ వర్ధంతి ఈరోజు, 1809 జనవరి 4వ తేదీన ఫ్రాన్స్‌లోని "క్రూవేలో" జన్మించిన బ్రెయిలీ తన పరిశోధనల ద్వారా అంధులకు ప్రత్యేక లిపి సృష్టించి విప్లవాత్మకమైన మార్పుకు నాంది పలికారు. అతి కీలకమైన

అంశాన్ని శోధించి ఎందరో చూపులేని వారికి ఆరాధ్యుడైన బ్రెయిలీ 1862 జనవరి 6వ తేదీన 43 ఏళ్ళ వయసులో కన్నుమూశారు. ఈ సందర్భంగా అంధుల కోసం ఆయన చేసిన విశిష్ఠ సేవలను ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు స్మరించుకుంటున్నారు.

---------------------------

తెలంగాణలో బీసీ కార్పొరేషన్ ద్వారా 'కాటమయ్య భద్రతా కిట్ల రెండో విడత పంపిణీలో భాగంగా 10 వేల మంది లబ్ధిదారులకు కిట్లను అందజేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ లోని పలు వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన కిట్లను ప్రభుత్వం గీత కార్మికులకు అందజేస్తుందన్నారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గీత కార్మికులకు కిట్లపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వీటిని కట్టుకొని చెట్లు ఎక్కడం ద్వారా ఎటువంటి ప్రాణహాని ఉండదని, ఈ అవకాశాన్ని గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

సంక్రాంతి రద్దీ దృష్ట్యా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య 52 అదనపు రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. తెలంగాణలోని సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్ల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, నర్సాపూర్, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు ఈ రైళ్లు నడపనున్నట్లు తెలిపింది. ఆయా ప్రాంతాలకు రేపటి నుంచి 18వ తేదీ వరకు ఇవి అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది.

---------------------------

దేశంలోని ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించి.. వాటి నిర్వహణను హిందువులకే అప్పగించాలని స్వామీజీలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు కోరారు. కృష్ణాజిల్లా కేసరపల్లిలో విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో నిన్న 'హైందవ శంఖారావం' సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్తు జాతీయ ప్రతినిధులు, బీజేపీ నాయకులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు పాల్గొన్నారు. ఈ సభలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మాన్ని సంప్రదాయాలను కాపాడాలని, దేవాలయాలకు రక్షణ కల్పించాలని చెప్పారు. అయోధ్య రామ మందిరం తరహాలో దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని పేర్కొన్నారు.

---------------------------

మాతృభాషను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు సమాఖ్య మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. తెలుగులో మాట్లాడడం అందరూ అలవాటుగా చేసుకోవాలన్నారు. దేశంలో గొప్ప పదవుల్లో ఉన్నవారంతా మాతృభాషలో చదువుకున్నవారేనని చెప్పారు. ప్రాథమిక విద్యను తెలుగు భాషలో అందించాలి" అని వెంకయ్యనాయుడు అన్నారు.

---------------------------

రబీ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం 22.30 లక్షల టన్నుల ఎరువులను కేటాయించిందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెలలో 2.29 లక్షల టన్నుల యూరియాకు గానూ.. 2.32 లక్షల టన్నులను కేటాయించిందని ఒక ప్రకటనలో వెల్లడించారు.

=====================